క్లుప్తంగా

కొప్పుల ప్రసాద్‌కు పురస్కారం



కొప్పుల ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన కవి కొప్పుల ప్రసాద్‌కు సేవా స్పందన పురస్కారం లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన ఈదా ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగాబ్రహ్మకుమారి, శాంతి సరోవర్ అనే కార్యక్రమంలో పాల్గొని నేటి యువత ఆత్మహత్యల నివారణకు సమాజం, తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై ఉపన్యసించగా సేవా స్పందన పురస్కారంతో సన్మానించి మెమొంటో, ప్రశంసా పత్రంతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈదా శామ్యూల్‌రెడ్డి సన్మానించారని చెప్పారు. పట్టణంలోని పలువురు సాహితీ వేత్తలు, కవులు ఆయనను అభినందించారు.

ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): మాఘమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సోమనంది, నాగనంది, ప్రథమనంది, కాళికాంబ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమనంది ఆలయంలో స్వామి వారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం చేపట్టి నాగాభరణంతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. శ్రీకాళికాంబ దేవస్థానంలో స్వామి వారిని ప్రత్యేక పూజలు నిర్వహించి నాగాభరణంతో అలంకరించారు. ఈఓ లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(వ్యవసాయం): ఫిబ్రవరి 1వ తేదీ నుంచి యోగా శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకులు ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురూజీ తెలిపారు. సోమవారం యోగా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ టౌన్‌హాల్ పక్కనున్న మున్సిపల్ పార్కు ఆయుష్ యోగా కేంద్రంలో రోజూ ఉదయం రెండు బ్యాచ్‌లు, సాయంత్రం 4.30 గంటలకు ఒక బ్యాచ్ ప్రా రంభిస్తున్నట్లు చెప్పారు.వివరాలకు సెల్: 9989983673 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు మండల మీట్

శిరివెళ్ల: ఈ నెల 31వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన జరగనున్న సమావేశంలో గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, తాగునీరు, వ్యవసాయం, స్త్రీ శిశుసంక్షేమం, రవాణా, ఉపాధి, పౌరసరఫరాల శాఖలపై చర్చ జరుగుతుందని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

క్రీడాకారులకు అభినందన

నంద్యాల(సిటీ): స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆవరణలో సోమవారం ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఫర్ ఉమన్ ఛాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానంలో నిలిచిన రామకృష్ణ సంస్థ విద్యార్థులు అభినందనీయులని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులు ఎమ్మెల్యే నివాస గృహంలో సోమవారం ఆయనను కలువగా అభినందించారు. అంతకుముందు స్థానిక పీజీ కళాశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు.

స్పందనపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులతో మాట్లాడారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ డీఈ నాగరాజు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి శైలజ, ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.

ముఖ హాజరు నుంచి మినహాయించాలి

నంద్యాల(అర్బన్): మున్సిపల్ కార్మికుల్లో 99 శాతం మంది నిరక్షరాస్యులైనందున వారికి ఫేస్ రికగ్నైజ్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) నుంచి మినహాయింపునివ్వాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య కోరారు. పాత పద్ధతిలోనే మస్టర్ తీసుకోవాలన్నారు. సోమవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు ఎఫ్ఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు.

సేవ చేయడంలోనే సంతృప్తి



చెక్కు అందజేస్తున్న శిల్పానాగినిరెడ్డి

నంద్యాల: పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని శిల్పా మహిళా బ్యాంక్ చైర్ పర్సన్ శిల్పా నాగినిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డ్‌లో శిల్పా మహిళా సంఘం ఆధ్వర్యంలో 127 మంది మహిళలకు రూ.15 లక్షల చెక్కులను అందజేశారు.

రైతన్న 'ధర'హాసం

- వరి, మినుము, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర
- ఆశించిన స్థాయిలో దిగుబడి
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ధర పెరుగుతుందని నిల్వ చేసిన వరి ధాన్యం

శిరివెళ్ల: ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తే రైతన్నకు ఎనలేని సంతోషం. ఆశించిన స్థాయిలో దిగుబడితో పాటు ధర కూడా లభిస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలకు 2022 కలిసొచ్చింది. మండలంలో ఖరీఫ్‌లో మినుము, వరి పంట, మొక్కజొన్న పంటలు దిగుబడి బాగా రావడంతో పాటు ధర ఊహించిన దానికన్నా అధికంగం లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి పంట ఎకరాకు 35- 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఇక ధర కూడా 75 కిలోల బస్తా ప్రారంభంలోనే ధాన్యం పసిమి ఉన్నా రూ.1680 నుంచి రూ.1800 వరకు కొనుగోలు చేశారు. నెల గడిచిన తరువాత రూ.2050 పలికింది. ప్రస్తుతం రూ.2200 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. కోతలు పూర్తియన నెల రోజుల్లోగానే నీ ధర ఎప్పుడు రాలేదని రైతులు పేర్కొంటున్నారు. కొందరు రైతులు మరింత ధర లభించే అవకాశముందని ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. కాగా గత రెండేళ్ల నుంచి సాగు కలిసి రాక నష్టాలు చవిచూశారు. అలాగే మినుము పంట దిగుబడి 8-10 క్వింటాళ్లు వచ్చింది. క్వింటా ధర రూ.7 వేలు పలికింది. పెట్టుబడి తక్కువ కావడంతో కర్షకుడికి బాగా మిగిలింది. ఇలా పంటలు పండి, ధర లభిస్తే వ్యవసాయం పండుగే అని చెబుతున్నారు.

దిగుబడి వచ్చింది..ధర అబ్బింది



ఈ ఏడాది వ్యవసాయం అచ్చొంది. వరి పంట దిగుబడి ఎకరానికి 40 బస్తాలు వచ్చింది. ధర ఊహించని విధంగా లభించింది. వరి కోతలు కోసే సమయానికే 76 కేజీల బస్తాల ధాన్యం రూ.1600 పలికింది. ఇప్పుడు ధర రూ.2వేలు దాటింది. ఇంతకు ముందు సంవత్సరం పొడవునా నిల్వ చేసినా రూ.2 వేలు లభించేది కాదు. అలాంటిది పైరు కోసిన నెల రోజులకే ఈ ధర అబ్బడం సంతోషమే.

– శ్రీనివాసులరెడ్డి, రైతు, వీరారెడ్డిపల్లె

ధర బాగా ఉంది



గతేడాది జూన్‌లో మినుము పంట వేశాను. వాతావరణం అనుకూలించి పంట బాగా పండింది. ఎకరా నికి 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.ధర కూడ రూ.7 వేలు పలికింది. పంటసాగుకు పెట్టుబడి తక్కువ కావడంతో బాగా మిగిలింది. ఇలా ప్రతి ఏటా పంట, ధర అబ్బితే రైతన్న బాగు పడతాడు.

– రామచంద్రారెడ్డి, మినుము రైతు, మోత్కులపల్లె

ఈ ఏడాది మంచి ధర



వరికి ఈ ఏడాది మంచి ధర వచ్చింది. పైరు కోసిన సమయంలో కల్లంలోనే పచ్చి ధ్యాన్యం ను రూ.1600ల ప్రకారం కొన్నాం. ఇప్పుడు రూ.2,050 నుండి రూ. 2,150 వరకు కొనుగోలు చేస్తున్నాం. ధర ఇంకా పెరుగుతుందని, రైతులు అమ్మడానికి ముందుకు రావడం లేదు. ఇలాగే వస్తే రైతుకు మంచి లాభాలు వస్తాయి.

– చంద్రారెడ్డి, వ్యాపారి

ఎర్రగుడిదిన్నెలో ప్రారంభానికి ముస్తాబయిన వెల్‌నెస్ సెంటర్ భవనం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా..



ప్రారంభానికి సిద్ధంగా నీటి ట్యాంక్

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నెలో వెల్‌నెస్ సెంటర్ భవనం, నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయంపై పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకూడదని వెల్‌నెస్ సెంటర్లను తీసుకు వచ్చారన్నారు.దాదాపు రూ.18లక్షలతో భవన నిర్మాణ పనులను పూర్తి చేయించామని, అలాగే రూ.20 లక్షలతో రక్షిత మంచి నీరు అందించేందుకు నూతన ట్యాంక్ నిర్మించామని చెప్పారు. వాటిని త్వరలో ఎమ్మెల్సీ గంగుల ప్రభకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించి వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రికి చెందిన అశ్రితారెడ్డి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి అండర్ – 14 పోటీలు ఈ నెల 28వ తేదీన ముగిశాయి. ఈ పోటీల్లో పాల్గొన్న సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన అశ్రితారెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినిని హెచ్ఎం స్మిత, ఉపాధ్యాయులు అభినందించారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎర్రగుడిదిన్నెలో వాహనాన్ని ప్రారంభించిన గంగుల మనోహర్‌రెడ్డి

రుద్రవరం: మూగ జీవాలు ఉన్న ప్రతి రైతు పశు వైద్య సంచార వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి సూచించారు. పశువుల ఆరోగ్యం నిమిత్తం ఇంతకుముందు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి ఒక వాహనం మంజూరైంది. 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సిబ్బంది వాహనంతో పశువు ఉన్న చోటుకు వచ్చి వైద్యం అందజేస్తుందని చెప్పారు. ఆరు మండలాలకు ఒక వాహనం ఉండటంతో ఇబ్బందిగా ఉందని గ్రహించి ప్రభుత్వం రెండు మండలాలకు ఒకటి చొప్పున మంజూరు చేసిందని చెప్పారు. ప్రస్తుతం రుద్రవరం,శిరివెళ్ల మండలాలకు ఒక సంచార వాహనాన్ని అందజేశారని వివరించారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె పశువైద్య శాల వద్ద ఏడీ గిడ్డయ్య, వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ తదితరులతో కలిసి ప్రారంభించారు. రెండు మండలాల పశు వైద్య సిబ్బంది, సహకార సంఘం డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి ఉన్నారు.

చిరుధాన్యాలకు విదేశాల్లో ఆదరణ



రామసుబ్బారెడ్డిని సన్మానించిన కలెక్టర్

నంద్యాల(అర్బన్): ప్రాసెసింగ్ చేసిన చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులకు విదేశాల్లో మంచి ఆదరణ ఉందని, నంద్యాల జిల్లా జిల్లెల్లకు చెందిన కేవీ రామసుబ్బారెడ్డి తెలిపారు. ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుతో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారు చేస్తూ వివిధ దేశాలకు పంపుతున్న సందర్భాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కలిసి రామసుబ్బారెడ్డి సోమవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన కృషిని కలెక్టర్ అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకొని ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో చిరుధాన్యాల గురించి ప్రస్తావించారన్నారు. నంద్యాల వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన స్థానం సహకారంతోనే ఈ ఘనతను సాధించానన్నారు. డీఏఓ మోహన్‌రావు, చిరుధాన్యాల శాస్త్రవేత్త నరసింహులు, హార్టికల్చర్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

'వెన్నపూస' విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

నంద్యాల(అర్బన్): రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం పట్టణంలోని పలు కళాశాలల, అధ్యాపకులను కలిసి విస్తృత ప్రచారం చేశారు. తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను కోరారు. స్థానిక గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దస్తగిరిరెడ్డి, మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, సన్నల సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వైద్య సంచార వాహనాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి తెలిపారు. మూగ జీవాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత అంబులెన్స్‌ను గోస్పాడు మండలానికి మంజూరు చేసిందని చెప్పారు. వాహనాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డితో కలిసి ప్రారంభించారు.నంద్యాల జిల్లా పశువైద్యాధికారి నరసింహారావు, సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి, పార్థసారధిరెడ్డి, పశువైద్యులు ఉమాదేవి, కిశోర్‌కుమార్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే శిల్పా రవి
- అట్టహాసంగా నంద్యాల మార్కెట్‌యార్డు పాలక మండలి ప్రమాణస్వీకారం



మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న మహేశ్వరరెడ్డి

నంద్యాల: జిల్లాలో మిరప పంటను రైతులు అధికంగా సాగు చేస్తారని, పంటను అమ్ముకోవడానికి గుంటూరుకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నంద్యాలలో మిర్చి యార్డును ప్రారంభిస్తామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక మార్కెట్‌యార్డులో అట్టహాసంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా దేరెడ్డి మహేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్‌గా చిమ్మా నాగన్న, డైరెక్టర్లుగా బొల్లిమునయ్య, కొత్త కృష్ణమూర్తి, చిలమకూరు వెంకటేశ్వరరెడ్డి, బచ్చు శ్రీనివాస చక్రవర్తి, జల్లిపల్లి దిలీప్‌కుమార్, కత్తి శంకర్, జాగలి లింగమ్మ, చిక్కెం లక్ష్మీప్రసన్న, రాజేశ్వరమ్మ, మమత, షేక్ సర్దజ్, షేక్ కౌసర్, బిలావత్ హైమావతి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మార్కెట్ యార్డు గౌరవాధ్యక్షులు, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి కల్పన, మార్కెటింగ్ అధికారి రహిమాన్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నల సంక్షేమ, అభివృద్ధి కోసం నూతన పాలక వర్గం కృషి చేయాలని సూచించారు. ఉప ఎన్నికల తర్వాత రెండు సంవత్సరాలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి ఖాళీగా ఉన్నా.. ఉప ఎన్నికల సమయంలో అడిగిన ప్రతి ఒక్కరికి మీకే చైర్మన్ అంటూ 15మందికి పైగా టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని, దీంతో ఎవరికి పదవి ఇస్తే ఏమవుతుందోనని రెండేళ్ల పాటు ఎవరికీ పదవి ఇవ్వకుండా నాన్చారన్నారు. మార్కెట్ చైర్మన్ పదవి కూడా ఇచ్చుకోవడానికి ధైర్యం వారికి సరిపోక హామీ ఇచ్చిన వారికి మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుకున్న చరిత్ర ఆ పార్టీ నాయకులదన్నారు ప్రజలు తమ నాయకత్వం మీద నమ్మకం, విశ్వాసం ఉందని చెప్పడానికి 2004, 2009, 2019 శిల్పా కుటుంబానికి అధికారాన్ని కట్టబెట్టారని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఒకరిని విమర్శించేటప్పుడు ఆత్మ విమర్శ చేసుకోవాలని, వారు గీత దాటితే వారి బండారం బయట పెడతామని హెచ్చరించారు. దౌర్జన్యాలు, బెదిరింపులు, కబ్జాలు, కాంట్రాక్టర్లను భయపెట్టడం, కమీషన్ల పేరుతో దందాలు ఎవరు చేస్తున్నారో ప్రజలకు తెలుసునని, తాము ఏనాడూ ఇలాంటి రాజకీయాలు చేయలేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అన్ని వర్గాలకు, కులాలకు సమన్యాయం చేస్తూ పదవులను కల్పిస్తుందని గర్వంగా చెబుతున్నామన్నారు. అధికారంలో ఉన్న తాము ధైర్యంగా గడప గడపకు వెళ్లి ప్రజల సంక్షేమం గురించి తెలుసుకుంటున్నామని, దేశంలో ఎక్కడైనా అధికారంలో ఉన్న పార్టీ నాయకులు గడప గడపకు ఎవరైనా వెళ్లారా అని ప్రశ్నించారు. తాము ప్రజలకు మంచి చేశాం కాబట్టే మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సీఎంతో మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, జెడ్పీటీసీ గోకుల కృష్ణారెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, గోస్పాడు ఎంపీపీ, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, దృశ్య కళల డైరెక్టర్ సునీత, రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తంరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, సిద్దం శివరాం, మేడా లక్ష్మయ్య మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నంద్యాల, గోస్పాడు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

దొర్నిపాడు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ నాగఅనసూయ పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఈసీగా విధులు నిర్వహిస్తున్న సోమశేఖర్‌ను ఇటీవల జిల్లా ఉత్తమ ఈసీగా గుర్తిస్తూ కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ప్రసంశా పత్రం, మొమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈసీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. జాబ్‌కార్డు కల్గిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని కోరారు. మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. సాంకేతిక సహాయకులు బషీర్ అహ్మద్, ప్రసాద్‌రెడ్డి, రాజు, రవిశేఖర్‌రెడ్డి, జయశేఖర్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు, పుల్లయ్య, రమణ, చెన్నయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహాత్ముని జీవితం ఆదర్శం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): మహాత్ముని జీవితం ప్రజలందరికీ ఆదర్శమని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ శాంతి, అహింస ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన మహోన్నతుడు గాంధీజీ అని కొనియాడారు. శాంతియుతంగా మెలగుతూ గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, ఆర్ఓ వరప్రసాద్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహ మూర్తి, డీఈఈ మధుకుమార్, ఏఎస్ఓ వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్త, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ వైస్ చైర్మన్ కండే శ్యాంసుందర్ లాల్, జనార్ధన్, నాగరాజు, రామకృష్ణ, సముద్రాల కుమార్, లక్ష్మయ్య, వినోద్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మహాత్మాగాంధీ ఆశయాలతో ముందుకు సాగుదామని వక్తలు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేద్దాం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని వైద్యులతో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అయన మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు 15 రోజులపాటు కుష్టువ్యాధి నిర్మూలన కోసం వైద్య సిబ్బందితో కలిసి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ, వైద్యులు మల్లికార్జున రెడ్డి, చంద్రశేఖర్, రేఖ, కాంతారావు, విజయ్‌కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

నంద్యాల(రూరల్): కుష్టు రోగులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలతో పాటు మందులు కూడా పంపిణీ చేస్తున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుజాత అన్నారు. సోమవారం మండలంలోని పులిమద్ది ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం గ్రామ సర్పంచ్ రఘురామిరెడ్డి, ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం దస్తగిరమ్మ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలో కుష్టు వ్యాధి వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ఆరోగ్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ కోరారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి, జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో ప్రతిజ్ఞ చేశారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు 15 రోజుల పాటు స్పర్శ కార్యక్రమాలు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

గోస్పాడు: కుష్టు వ్యాధి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి కాంతరావు నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ వర్ధంతి సంధ్బంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తి మేరకు కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలని కోరారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశంలో నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లోని స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. సోమవారం స్థానిక నరసింహయ్య భవన్‌లో సుబ్బరాయుడు అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. నాయకులు నాగన్న, త్యాగరాజు, సుబ్రమ్మ, దేవదాసు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.